క్లుప్తంగా

వెంకన్నకు భక్తుల మొక్కుల చెల్లింపు



గుడ్లవల్లేరు: డోకిపర్రు భూ సమేత శ్రీ వెంకటేశ్వర స్వామిని దర్శించుకునేందుకు శనివారం భక్తులు అధిక సంఖ్యలో విచ్చేసి మొక్కులు చెల్లించుకున్నారు. దూరప్రాంతాల నుంచి వచ్చిన భక్తులకు భారీ అన్నసమారాధన నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని మెయిల్ ప్రతినిధి పురిటిపాటి వీరారెడ్డి, విజయలక్ష్మి దంపతులు ప్రారంభించారు. మెయిల్ మేనేజింగ్ డైరెక్టర్ పురిటిపాటి వెంకటకృష్ణారెడ్డి, సుధారెడ్డి ఆర్థిక సాయంతో జరిగిందని నిర్వాహకులు తెలిపారు.

ఎయిడ్స్ నియంత్రణపై కళాజాత



మండవల్లి: జాతీయ ఎయిడ్స్ నియంత్రణ సంస్థ ఆధ్వర్యంలో ఏపీ ఎయిడ్స్ నియంత్రణ సంస్థ పర్యవేక్షణలో శనివారం మండవల్లిలో హెచ్ఐవీ నియంత్రణకు, నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై కళాజాత శనివారం నిర్వహించారు. గుడివాడకు చెందిన ఎం.శేఖర్ అండ్ పార్టీ కళాకారులు వీధి నాటిక ద్వారా అవగాహన కల్పించారు. పంచాయతీ సిబ్బంది, వైద్య సిబ్బంది, స్వచ్ఛంద సేవాసంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు.

బల్లిపర్రు లాకుల అభివృద్ధికి రూ.40 లక్షలు



పామర్రు: స్థానిక బల్లిపర్రు లాకుల అభివృద్ధికి ప్రభుత్వం రూ.40 లక్షలు మంజూరు చేసినట్లు ఎమ్మెల్యే వర్ల కుమార్ రాజా తెలిపారు. శనివారం స్థానిక బల్లిపర్రు లాకుల వద్ద జరుగుతున్న పనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ లాకుల షట్టర్లను అభివృద్ధి పర్చటంతో పాటు ఇతర సమస్యలను సత్వరమే పరిష్కరించాలన్నారు. కార్యక్రమంలో కృష్ణా జిల్లా ప్రాజెక్టు కమిటీ చైర్మన్ వెంకటేశ్వరరావు, డీసీ కమిటీ చైర్మన్ కొసరాజు వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

కళాపీఠం అధ్యక్షుడికి సత్కారం



పామర్రు: స్థానిక కళాపీఠం కార్యాలయంలో ఆ పీఠం అధ్యక్షుడు కాటూరి వెంకట మురళీకృష్ణను శనివారం సత్కరించారు. ఈ సందర్భంగా చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు బొగ్గరపు జాలయ్య మాట్లాడుతూ పీఠం ఏర్పాటు చేసిన నాటి నుంచి కళాకారులను గుర్తించి సన్మానించడం, కళలను ప్రోత్సహించినట్లు తెలిపారు. అంతే కాకుండా అనేక సేవా కార్యక్రమాలను నిర్వహించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో సభ్యులు బి.సాయిబాబు, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఆధ్యాత్మిక చింతన అవసరం



కలిదిండి (కైకలూరు): ప్రజలు ఆధ్యాత్మిక చింతనను అలవర్చుకోవాలని వైఎస్సార్ సీపీ ఏలూరు జిల్లా అధ్యక్షుడు దూలం నాగేశ్వరరావు (డీఎన్నార్) అన్నారు. కలిదిండి మండలం ఆవకూరులో శ్రీ సీతారామలక్ష్మణ, ఆంజనేయ, గణపతి విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమంలో శనివారం పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు.

తాగునీటి కోసం అవస్థలు

పట్టించుకోని అధికారులు

మండవల్లి: మండలంలోని తక్కెళ్లపాడు తాగునీటి చెరువులో నీరు కలుషితంగా ఉండడంతో గ్రామస్తులు అవస్థలు పడుతున్నారు. సుమారు 20 ఏళ్ల క్రితం ఆర్‌డబ్ల్యూఎస్ ఆధ్వర్యంలో చెరువును ఏర్పాటు చేశారు. అదేవిధంగా ఫిల్టర్ బెడ్ కూడా లేకపోవడంతో చెరువులో నీటిని ప్రజలు వినియోగించుకోవడం లేదు. ఈ చెరువుకు చుట్టూర ఫెన్సింగ్ లేకపోవడంతో పశువులు దిగి నీటిని కలుషితం చేస్తున్నాయి. ఈ చెరువు ద్వారా గతంలో పరిసర గ్రామాలైన తక్కెళ్లపాడు, ఆనందపురం, నుచ్చుమిల్లి, పులపర్రు, దయ్యంపాడు, కొవ్వాడలంక తదితర గ్రామాలకు తాగునీటిని కుళాయిల ద్వారా పంపిణీ చేసేవారు. తాగునీటి పథకానికి ఫిల్టర్ బెడ్ కూడా లేకపోవడంతో ఈ చెరువులో నీటిని ప్రస్తుతం ఆయా గ్రామాల ప్రజలు వినియోగించుకోవడం లేదు. ఒక్కో వాటర్ క్యాన్‌ను రూ.20కు కొనుక్కుని తాగునీటి కోసం ఉపయోగించుకుంటున్నారు.



తక్కెళ్లపాడు తాగునీటి చెరువు

స్నానం చేస్తే దురదలు

తక్కెళ్లపాడు తాగునీటి చెరువులోని నీటితో స్నానం చేసినా దురదలు వస్తున్నాయని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు, పాలకులు చెరువును అభివృద్ధి చేసి పరిసర గ్రామాల ప్రజలకు తాగునీటి అవసరాలు తీర్చే విధంగా చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

తాగునీరు అందడం లేదు



తక్కెళ్లపాడు మంచినీటి చెరువు ద్వారా ఆ చెరువు పరిధిలోని గ్రామాల వారికి ఏ ఒక్కరికీ స్వచ్ఛమైన తాగునీరు అందడం లేదు. కుళాయిల ద్వారా నీరు వస్తున్నప్పటికీ ఆ నీరు కనీసం స్నానానికి కూడా పనికి రావడం లేదు. స్నానం చేస్తే దురదలు వస్తున్నాయి.

– అబ్బూరి సామియేలు, తక్కెళ్లపాడు

వాటర్ క్యాన్లు కొంటున్నాం



అధికారులు మొక్కుబడిగా తాగునీటిని కుళాయిల ద్వారా సరఫరా చేస్తున్నారు. ఆ నీటి ద్వారా ఎలాంటి ప్రయోజనం లేదు. గుక్కెడు నీళ్లు నోట్లో పోసుకునే వీలు లేదు. రూ.20 చెల్లించి వాటర్ క్యాన్ కొనుగోలు చేసి దాహం తీర్చుకుంటున్నాం.

– బేతాటి జోసఫ్, తక్కెళ్లపాడు

మైక్రోఫిల్టర్ అమర్చాం

మైక్రో ఫిల్టర్‌ను అమర్చాం. నాలుగు రోజుల్లో దీని ద్వారా నీరు సరఫరా చేస్తాం. చెరువుకు ఫెన్సింగ్ ఏర్పాటు చేసేందుకు సీఈఓను నిధులు అడిగితే ఇస్తామన్నారు. ఫెన్సింగ్ ఏర్పాటు చేస్తే చెరువులో పశువులు దిగడానికి అవకాశం ఉండదు. దీంతో స్వచ్ఛమైన నీరు అందుతుంది.

– టీవీవీ నాగబాబు, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ

వేసవి శిబిరాలతో విద్యార్థులకు విజ్ఞానం

గుడ్లవల్లేరు: వేసవి విజ్ఞాన శిబిరాల్లో నిర్వహించే ఆటలు, క్విజ్ పోటలు తదితర కార్యక్రమాలతో విద్యార్థులకు విజ్ఞానం పెంపొందుతుందని అంగలూరు, గుడ్లవల్లేరు గ్రంథాలయాధికారులు పి.వి.వి.పద్మజ, వాణి తెలిపారు. శనివారం శిబిరాల్లో భాగంగా విద్యార్థులకు చెస్, క్యారమ్స్ తదితర పోటీలను నిర్వహించినట్లు పేర్కొన్నారు.

గుడివాడలో..

గుడివాడ టౌన్: స్థానిక రాజేంద్రనగర్‌లోని శాఖా గ్రంథాలయంలో వేసవి శిక్షణ తరగతులు శనివారం కూడా కొనసాగినట్లు గ్రంథాలయ అధికారి పి.శాంతి తెలిపారు. ఇందులో భాగంగా పలు అంశాలపై శిక్షణ ఇచ్చామని పేర్కొన్నారు. శనివారం పాటల పోటీలు నిర్వహించామని తెలిపారు.

నీతి కథల బోధన

జమీగొల్వేపల్లి(పామర్రు): నీతి కథల ద్వారా విద్యార్థుల్లో ఆలోచనాశక్తి పెంపొందుతుందని ఉపాధ్యాయిని పద్మావతి పేర్కొన్నారు. మండలంలోని జమీగొల్వేపల్లిలోని శాఖా గ్రంథాలయంలో శనివారం విద్యార్థులకు నీతికథలను బోధించారు. గ్రంథాలయాధికారి నాగ సురేష్ పాల్గొన్నారు.

పామర్రులో..

స్థానిక ద్వితీయ శ్రేణి గ్రంథాలయంలో గ్రంథాలయ పితామహుడు అయ్యంకి వెంకటరమణయ్య గురించి డిబేట్ కార్యక్రమం నిర్వహించినట్లు లైబ్రేరియన్ ఎం.ఝాన్సీరాణి పేర్కొన్నారు. అనంతరం ఎక్కాలను చిన్నారులతో చెప్పించినట్లు తెలిపారు.

మండవల్లిలో..

మండవల్లి: విద్యార్థులకు చదువుతో పాటు ఆరోగ్యం కూడా ముఖ్యమని మండవల్లి లైబ్రేరియన్ ఎస్‌కే పర్వీన అన్నారు. వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా విద్యార్థులతో మాట్లాడుతూ ఆరోగ్యం కోసం ప్రతి రోజూ వ్యాయామం చేయడం ద్వారా మెదడు చురుగ్గా పనిచేస్తుందని, దీంతో తాము చేసే ప్రతి పనిలో చురుగ్గా పాల్గొంటారని పేర్కొన్నారు. అనంతరం పుస్తక పఠనం చేయించారు.

ముదినేపల్లిలో..

ముదినేపల్లి రూరల్: స్థానిక శాఖా గ్రంథాలయంలో జరుగుతున్న వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా శనివారం విద్యార్థులకు నీతికథలు బోధించినట్లు లైబ్రేరియన్ శ్రీదేవి తెలిపారు. అనంతరం ఆటలు, చిత్రలేఖన పోటీలు నిర్వహించారు.

విత్తన శుద్ధితో మేలైన దిగుబడులు

తోట్లవల్లూరు: విత్తన శుద్ధితో మేలైన, అధిక దిగుబడుల సాధనకు వీలు కలుగుతుందని జిల్లా రైతు శిక్షణ కేంద్రం డెప్యూటీ డైరెక్టర్ జ్యోతి రమణి తెలిపారు. మండలంలోని భద్రిరాజుపాలెంలో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో వికసిత సంకల్ప అభియాన్ కార్యక్రమం శనివారం జరిగింది. ఈ సందర్భంగా జ్యోతి రమణి విత్తనశుద్ధి చేయటం ద్వారా కలిగే ఉపయోగాలను వివరించారు. మట్టి నమూనా పరీక్షలు, పచ్చిరొట్ట విత్తనాల ప్రాముఖ్యత, ప్రకృతి వ్యవసాయం, రసాయన ఎరువుల వినియోగం తగ్గించటం, డ్రోన్ల వినియోగం తదితర అంశాలపై ఆమె రైతులకు అవగాహన కలిగించారు. డీఆర్‌సీ ఏడీఏ శ్రీనివాసరావు, ఏఓ పద్మజ, ఘంటసాల కేవీకే ప్రతినిధి కృష్ణవేణి, మండల వ్యవసాయాధికారి శ్రీనివాసరావు, ఉద్యానశాఖాధికారి చందు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఏఓ నాగేశ్వరరావు

ధూమపానానికి దూరంగా ఉండండి

ఎమ్మెల్సీ జయమంగళ

కైకలూరు: పొగాకు అలవాటు జీవితాలను నాశనం చేస్తోందని, ధూమపానానికి దూరంగా ఉండాలని ఎమ్మెల్సీ జయమంగళ వెంకటరమణ పేర్కొన్నారు. స్థానిక మండల పరిషత్ ఆవరణలో నవజీవన్ బాలభవన్ ఆధ్వర్యంలో ప్రపంచ పొగాకు వ్యతిరేక దినోత్సవం సందర్భంగా ఏర్పాటు చేసిన సంతకాల సేకరణకు ముఖ్య అతిథిగా శనివారం విచ్చేశారు. మొదటి సంతకం చేసిన ఎమ్మెల్సీ మాట్లాడుతూ పొగ తాగేవారితో పాటు పీల్చే వారికి ఆరోగ్యం పాడవుతుందన్నారు. పొగ రహిత సమాజాభివృద్ధికి అందరూ సహకరించాలన్నారు. పట్టణ ఎస్ఐ డి.వెంకట్‌కుమార్ మాట్లాడుతూ పొగాకును ఏ రూపంగా ఉపయోగించినా ప్రమాదమే అన్నారు. యువత మత్తుకు బానిసలు కావద్దని చెప్పారు. నవజీవన్ బాలభవన్ నిర్వాహకురాలు లీలావతి మాట్లాడుతూ పొగాకు వ్యసనపరులకు నూజివీడులో నవజీవన్ సంస్థకు చెందిన బోస్కో డి అడిషన్ సెంటర్‌లో ఉచిత చికిత్స అందిస్తారన్నారు. అవకాశాన్ని సద్వినియోగపర్చుకోవాలన్నారు. అనంతరం పోస్టర్‌ను ఆవిష్కరించారు.



పొగాకు వ్యతిరేక దినోత్సవ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్సీ జయమంగళ, ఎస్ఐ వెంకట్‌కుమార్

ప్రభుత్వ ఆర్భాటంతో విద్యార్థులు బలి

ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి సమరం

గుడివాడ టౌన్: తాము ఏదో గొప్ప చేశామని చెప్పుకునేందుకు కూటమి ప్రభుత్వం చేసిన నిర్వాకం విద్యార్థులకు శాపంగా మారిందని భారత విద్యార్థి ఫెడరేషన్(ఎస్ఎఫ్ఐ) జిల్లా కార్యదర్శి ఎస్.సమరం అన్నారు. శనివారం ఈ మేరకు ఓ ప్రకటన విడుదల చేశారు. విద్యాసంస్కరణల పేరుతో చరిత్రలో ఎన్నడూలేనివిధంగా 10వ తరగతి పరీక్షల మూల్యాంకనం ఏడు రోజుల్లో పూర్తి చేశామని విద్యాశాఖా మంత్రి ఆర్భాటంగా చెప్పుకున్నారని పేర్కొన్నారు. 15 రోజులు మూల్యాంకనం చేసి, ఫలితాలు ఇవ్వాల్సింది పోయి హడావిడిగా ఉపాధ్యాయులపై ఒత్తిడి తేవడంతో జరిగిన పొరపాటుకు ఎంతో మంది విద్యార్థులు కొన్ని రకాల విద్యకు అర్హత కోల్పోయారని తెలిపారు. 10వ తరగతి పరీక్షల్లో ఫెయిల్ అయిన విద్యార్థులు 66,363 మంది రీ వాల్యూయేషన్, రీ వెరిఫికేషన్‌కు దరఖాస్తు చేయడం ప్రభుత్వ నిర్లక్ష్యానికి ఉదాహరణ అని పేర్కొన్నారు. గతంలో ఎన్నడూ ఈ విధంగా జరగలేదని తెలిపారు. పదో తరగతి ఫలితాల్లో ఓ విద్యార్థినికి 23 మార్కులు వచ్చి ఫెయిల్ అయితే రీ వెరిఫికేషన్‌లో 96 మార్కులు రావడం ప్రభుత్వ నిర్లక్ష్యానికి నిదర్శనమని పేర్కొన్నారు. ఉపాధ్యాయులపై ఒత్తిడి తెచ్చి వారిని ఇబ్బందిపెట్టి తిరిగి ఉపాధ్యాయులనే బలి చేయడం సరైన విధానం కాదని తెలిపారు. ప్రభుత్వం తమ పొరపాటును ఒప్పుకోవాలని డిమాండ్ చేశారు.

శేషమ్మకు డీఎన్నార్ నివాళులు

ముదినేపల్లి రూరల్: మండలంలోని పెదపాలపర్రు గ్రామానికి చెందిన మెరుగుమాల శేషమ్మకు వైఎస్సార్ సీపీ ఏలూరు జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు(డీఎన్నార్) శనివారం నివాళులర్పించారు. శేషమ్మ కుటుంబ సభ్యులు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అభిమానులు కావడంతో పాటు గ్రామంలో పార్టీ అభివృద్ధికి విశేష కృషి చేసినట్లు డీఎన్నార్ తెలిపారు. వైఎస్సార్ సీపీ జిల్లా అధికార ప్రతినిధి మోట్రు ఏసుబాబు, నాయకులు గంటా కోటేశ్వరరావు, రాచూరికుమార్, పెనుమాక వెంకటేశ్వరరావు, బొప్పన ప్రసాద్, మెరుగుమాల రమేష్ పాల్గొన్నారు.

గణనాథునికి ప్రత్యేక పూజలు

కూచిపూడి(మొవ్వ): కూచిపూడి అగ్రహారంలో గంటలమ్మ (రావి చెట్టు) నీడలో సత్యసాయి బాబా మందిరం వద్ద రెండేళ్ల క్రితం చిన్నారులు ప్రతిష్ఠించిన వినాయకుని విగ్రహానికి శనివారం పూజలతో పాటు ద్వితీయ వార్షికోత్సవ వేడుకలు నిర్వహించారు. చిన్నారులు నిరాఘాటం శివరామచంద్ర కార్తికేయ శర్మ, పసుమర్తి సుబ్రహ్మణ్య శర్మ పూజలు నిర్వహించారు. సోమయాజుల అనంతరామ శర్మ సహకరించారు.

గ్రామాల అభివృద్ధికి కృషి

వానపాముల(పెదపారుపూడి): గ్రామాలాభివృద్ధికి ప్రభుత్వం చిత్తశుద్ధితో అభివృద్ధికి ముందుకు వెళుతుందని ఎమ్మెల్యే వర్ల కుమారరాజా అన్నారు. మండలంలోని వానపాముల గ్రామంలో కల్యాణ మండపంలో శనివారం సాయంత్రం ప్రగతిపథంలో పామర్రు కార్యక్రమాన్ని అధికారులతో నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గ్రామాల్లో ప్రభుత్వం చేసిన అభివృద్ధి పనులను వివరించారు.

సాధిక్‌కు సన్మానం

ఉద్యోగ విరమణ చేస్తున్న ఎంపీడీఓ సాధిక్‌ను ఎమ్మెల్యే వర్లకుమార్ రాజా, అధికారులు ఘనంగా సన్మాంచారు. కార్యక్రమంలో ఈఓపీఆర్డీ వంగా శ్రీనివాసరావు, టీడీపీ మండల అధ్యక్షుడు చలసాని రమేష్ చౌదరి, స్థానిక నీటి సంఘం అధ్యక్షుడు కాగిత లక్ష్మీనారయణ పాల్గొన్నారు.

సమాజాభివృద్ధికి సహకరించండి

పామర్రు: సమాజాభివృద్ధికి పాస్టర్లు తమవంతుగా సహకరించాలని క్రైస్తవ సంక్షేమ సంఘ అధ్యక్షుడు రెవరెండ్ డాక్టర్ సాల్మన్ కొల్లాబత్తుల పేర్కొన్నారు. స్థానిక చాట్లవానిపురంలోని విజన్ లైఫ్ సెంటర్‌లో మండల స్థాయి పాస్టర్ల సమావేశం శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాలలో క్రైస్తవులకు ప్రత్యేక శ్మశాన వాటికలు ఏర్పాటు చేయాలన్నారు.

క్షేత్రయ్య ఆరాధన మందిరం ప్రారంభం

మొవ్వ: మొవ్వలో నిర్మించిన శ్రీ క్షేత్రయ్య ఆరాధన మందిరాన్ని ఎమ్మెల్యే వర్ల కుమార్ రాజా శనివారం ప్రారంభించారు. శ్రీ భీమేశ్వర స్వామి ఆలయ సర్వ శ్రేయోనిధులు రూ.35 లక్షలు, దాతలు అందించిన రూ.30 లక్షలతో ఈ మందిరాన్ని నిర్మించారు. జెడ్పీటీసీ సభ్యుడు రాజులపాటి పార్వతి, దేవదాయ శాఖ జిల్లా సహాయ కమిషనర్ నూతక్కి వెంకట సాంబశివరావు, టీడీపీ మండల అధ్యక్షుడు లింగమనేని రామలింగేశ్వరరావు, రామలింగేశ్వర స్వామి దేవస్థానం ఈఓ సుబ్బారెడ్డి, భీమేశ్వరస్వామి దేవస్థానం ఈఓ ఎస్వీ సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు. అనంతరం మొవ్వలోని సిద్ధి వినాయక ఆటో యూనియన్ సభ్యులు ఎమ్మెల్యేను సత్కరించారు,

రేషన్ షాపుల వద్దే సరుకుల అందజేత

తోట్లవల్లూరు: రేషన్ సరుకులను ఆదివారం నుంచి రేషన్‌షాపుల వద్ద పంపిణీ చేయనున్నట్లు తహసీల్దార్ కుసుమకుమారి తెలిపారు. రేషన్ సరఫరా వ్యాన్లను రద్దు చేసిన నేపథ్యంలో కార్డుదారులు రేషన్‌షాపుల ద్వారా సరుకులు పొందాల్సి ఉంటుందని పేర్కొన్నారు. ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12, సాయంత్రం నాలుగు నుంచి రాత్రి 8 గంటల వరకు పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. 65 ఏళ్లు నిండిన వృద్ధులు, దివ్యాంగులకు వారి ఇంటి వద్దే డీలర్ అందజేస్తారని పేర్కొన్నారు.

రైతులు సేకరించిన నిధులతో పూడికతీత పనులు

కొమరవోలు డ్రెయిన్‌లో రెండేళ్లుగా తీయని పూడిక

కొమరవోలు(పామర్రు): కొమరవోలు డ్రెయిన్‌కు రెండేళ్లగా పూడికతీత పనులు చేపట్టకపోవడంతో రైతులు నిధులు సేకరించి పనులు చేపట్టారు. ఈ డ్రెయిన్ మొత్తం 19.4 కిలోమీటర్లు గురజ నుంచి పెదమద్దాలి వరకు వ్యాపించి ఉంది. రెండేళ్లగా ఆయకట్టు పొలాలు ముంపునకు గురై పంట నష్టం ఏర్పడుతోందని పలుమార్లు అధికారులకు తెలిపినా పట్టించుకోలేదు. దీంతో రైతులు క్రాప్ హాలిడేకు సిద్ధపడ్డారు. ఈ క్రమంలో స్థానికులు వల్లభనేని ప్రసాద్, పొట్లూరి సత్యనారాయణ, పొట్లూరి రామకృష్ణమోహన్, వల్లభనేని వెంకటేశ్వరరావు పంట విరామం మంచిది కాదని, డ్రెయిన్‌లో పామర్రు నియోజకవర్గ పరిధిలోని తొమ్మిది కిలోమీటర్లు పూడికతీత పనులు చేస్తే మంచిదని సూచనలు చేశారు. ఈ నేపథ్యంలో ఆయకట్టు రైతులు సుమారు రూ.5 లక్షలు సేకరించారు. ఈ నిధులతో ప్రసుత్తం డ్రెయిన్‌లోని పూడికతీత పనులకు శ్రీకారం చుట్టారు. అయితే సేకరించిన నిధులు సుమారు నాలుగు కిలోమీటర్ల వరకు మాత్రమే వస్తున్నాయి. ఈ విషయాన్ని కృష్ణా జిల్లా ప్రాజెక్టు కమిటీ చైర్మన్ డి.వెంకటేశ్వరరావు దృష్టికి రైతులు తీసుకెళ్లారు. ఇంకా నిధులు మంజూరు చేయాలని కోరారు. స్పందించిన చైర్మన్ సంబంధిత డ్రెయిన్ అధికారులకు ఈ సమస్యను తీసుకెళ్లి సత్వరమే పరిష్కరించేలా తగు చర్యలు తీసుకుంటామని రైతులకు హామీ ఇచ్చారు.



కొమరవోలు డ్రెయిన్‌లో పూడికతీత పనులు చేస్తున్న పొక్లెయినర్

రాయితీపై వరివిత్తనాల పంపిణీ

పమిడిముక్కల: వ్యవసాయశాఖ ద్వారా రైతులకు రాయితీపై వరి విత్తనాలు అందజేస్తున్నట్లు ఏఓ గణేష్‌రెడ్డి పేర్కొన్నారు. స్థానిక వ్యవసాయశాఖ కార్యాలయంలో కృష్ణాపురం డీసీ చైర్మన్ నాదెళ్ల సుబ్రమణ్యం, టీడీపీ మండల అధ్యక్షుడు రాజులపాటి శ్రీనివాసరావుతో కలిసి రైతులకు శనివారం వరివిత్తనాలు పంపిణీ చేశారు. ఏఓ మాట్లాడుతూ రైతు సేవా కేంద్రాల్లో ఎంటీయూ 1061,1318 రకం విత్తనాలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. రాయితీ పోను 30 కేజీల బస్తా రూ.1,110కు విక్రయిస్తున్నట్లు చెప్పారు. హనుమంతపురంలో జరిగిన వరి విత్తనాల పంపిణీ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ కొడమంచిలి మహేష్, మాజీ వైస్ ఎంపీపీ లింగమనేని బాబూరావు, వీఏఏ రవితేజ పాల్గొన్నారు.



రైతులకు వరి విత్తనాలు అందజేస్తున్న ఏఓ గణేష్‌రెడ్డి, డీసీ చైర్మన్ సుబ్రమణ్యం

ఘనంగా సూపర్‌స్టార్ కృష్ణ జయంతి

గుడివాడ టౌన్: సూపర్‌స్టార్ కృష్ణ 82వ జయంతి వేడుకలు శనివారం ఘనంగా నిర్వహించారు. సూపర్‌స్టార్ కృష్ణ, మహేష్‌బాబు ఫ్యాన్స్ అసోసియేషన్, జమదగ్ని ఫ్రెండ్స్ సర్కిల్ ఆధ్వర్యంలో తొలుత కృష్ణ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం కేక్ కట్‌చేసి శుభాకాంక్షలు తెలుపుకున్నారు. ఈ సందర్భంగా స్థానిక మందపాడులోని నిరాశ్రయ వృద్ధాశ్రమంలో అన్నసమారాధన నిర్వహించారు. కార్యక్రమంలో మహేష్‌బాబు ఫ్యాన్స్ జూనియర్ జమదగ్ని, చలపాక ఈశ్వర్, మనోజ్ కుమార్, దోనెపూడి సాయి, కె. వినోద్, సీహెచ్ నవీన్ తదితరులు పాల్గొన్నారు.

వంతెన పునర్నిర్మాణ పనులు ప్రారంభం

కాజ(మొవ్వ): మొవ్వ మండలం కాజలో అయినంపూడి డ్రెయిన్‌పై 12 ఏళ్ల క్రితం నిర్మించిన బైలి బ్రిడ్జి శిథిలావస్థకు చేరడంతో పునర్నిర్మాణానికి రూ.41 లక్షలను ప్రభుత్వం కేటాయించింది. ఈ నేపథ్యంలో ఈ బైలీ వంతెన పునర్నిర్మాణ పనులు ఎట్టకేలకు రెండు రోజుల నుంచి చేస్తున్నారు. అయితే వంతెనకు తాత్కాలిక మరమ్మతులు చేస్తుండడంతో గ్రామస్తులు, ప్రజా సంఘాల నాయకులు వ్యతిరేకిస్తున్నారు. ఈ వంతెన నిర్మాణంపై ప్రజాప్రతినిధులు, ఉన్నత స్థాయి అధికారులు దృష్టి సాగించి వంతెనను పూర్తి స్థాయిలో అభివృద్ధి చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు.

బ్రహ్మోత్సవాల రాటా ఏర్పాటు

గుడివాడ టౌన్: స్థానిక జగన్నాథపురం పాటిమీద వేంచేసియున్న వెంకటేశ్వరస్వామి వార్షిక బ్రహ్మోత్సవ మహోత్సవాల రాటా ఏర్పాటు శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ నెల ఆరు నుంచి 11వ తేదీ వరకు బ్రహ్మోత్సవాలు నిర్వహించాలని పాలకవర్గం నిర్ణయించిందని ఈఓ కె.వేణుగోపాలరావు తెలిపారు. ఏర్పాట్లు ప్రారంభం సూచికగా రాటా ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. అర్చకులు వేదాంతం అప్పలాచార్యులు పూజలు నిర్వహించి పందిరి స్తంభాన్ని నాటారు.

కోలాట బృందానికి దుస్తులు, కర్రల పంపిణీ

కైకలూరు: కోలాటం శిక్షణ పొందుతున్న మహిళా బృందానికి దాతలు యూనిఫాం, కోలాట కర్రలను శనివారం అందించారు. లోకుమూడిగరువు దత్తాశ్రమంలో 28 మంది మహిళలు కోలాటం నేర్చుకుంటున్నారు. బీసీ సంక్షేమ సంఘ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బూరుబోయిన శ్రీనివాసరావు చీరలు, బొక్కా వెంకట్రావు కోలాట కర్రలను పంపిణీ చేశారు.

నేటి నుంచి రేషన్ సరుకుల పంపిణీ

కైకలూరు: చౌకధరల దుకాణాల ద్వారా ఆదివారం నుంచి నిత్యావసర సరుకులు పంపిణీ చేయనున్నట్లు తహసీల్దార్ ఎండీ.ఇబ్రహీం తెలిపారు. పాత తహసీల్దార్ కార్యాలయం వద్ద రేషన్ డీలర్ల సమక్షంలో ఈ–పోస్, వెయిటింగ్ మిషన్లను శనివారం తనిఖీ చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కైకలూరులో ఎమ్మెల్సీ జయమంగళ వెంకటరమణ రేషన్ పంపిణీ కార్యక్రమాన్ని ఆదివారం ప్రారంభిస్తారని చెప్పారు. జిల్లాలో కోవిడ్ కేసులు వచ్చే అవకాశం ఉండటంతో మాస్కులు ధరించడం, సామాజిక దూరం పాటించాలన్నారు. ఆర్ఐ వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.



ఈ-పోస్ యంత్రాలను పరిశీలిస్తున్న తహసీల్దార్